తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | సోమవారం - 11 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 343 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టులకు

# కేంద్ర సహకారం కోరిన ముఖ్యమంత్రి

### వికసిత్ భారత్ లక్ష్యాల్లో తెలంగాణ కీలక భాగస్వామ్యం

### పెండింగ్ ప్రాజెక్టులకు సత్వర అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి

### పీఎం మిత్రా పార్క్ సహా పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు

**హైదరాబాద్, మే 10 (తెలంగాణ ముచ్చట్లు):** వికసిత్ భారత్ లక్ష్యాల సాధనలో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టుల ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. జాతీయ ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులకు కేంద్రం నుంచి త్వరితగతిన అనుమతులు లభించేలా ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రత్యేక సింగిల్ విండో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని హైదరాబాద్ అంతర్జాతీయ సదస్సుల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ వేడుకలో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో కలిసి ప్రధానమంత్రి పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, లోక్‌సభ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "2047 వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో తెలంగాణ తనవంతు పాత్ర పోషిస్తుంది. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం" అని తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధిలో మహానగరాల పాత్ర కీలకమని పేర్కొంటూ ఢిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలు బలపడితేనే దేశం ప్రపంచంలో అగ్రస్థానంలో నిలుస్తుందని అన్నారు.

మిగతా 2లో..





## తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అండగా ఉంటుంది

- రాష్ట్రాల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమన్న మోదీ
- హెచ్ఐసీసీ వేదికగా పలు ప్రాజెక్టులకు శ్రీకారం
- రేవంత్ రెడ్డిపై ప్రధాని సరదా వ్యాఖ్యలు

**హైదరాబాద్, మే 10 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రాల అభివృద్ధి లేకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తెలంగాణకు వచ్చిన ఆయన, హైదరాబాద్ హైటెక్‌సిటీలోని హెచ్ఐసీసీ వేదికగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. సభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిపై ప్రధాని సరదా వ్యాఖ్యలు చేశారు. "గత పదేళ్లుగా గుజరాత్‌కే ఎక్కువ నిధులు ఇచ్చారని రేవంత్ రెడ్డి అంటున్నారు. అయితే గుజరాత్‌కు ఎంత ఇచ్చామో చెప్పాలని నేనే ఇప్పుడు రేవంత్ రెడ్డిని అడుగుతున్నా" అంటూ ఛలోక్తులు విసరడంతో సభలో నవ్వులు వెల్లువెత్తాయి. తెలంగాణ వికసిస్తే

మిగతా 2లో..

## హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరుకు బుల్లెట్ రైలు



- ఆంధ్రప్రదేశ్ మీదుగా హైస్పీడ్ కారిడార్ ప్రతిపాదనలు
- గంటకు 600 కిలోమీటర్ల వేగానికి అనుగుణంగా డిజైన్
- అమరావతి విమానాశ్రయాన్ని కలుపుతూ ఎలైన్‌మెంట్ మార్పులు

**హైదరాబాద్/అమరావతి, మే 10 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌ను ఆంధ్రప్రదేశ్ మీదుగా చెన్నై, బెంగళూరుతో అనుసంధానించే అత్యాధునిక బుల్లెట్ రైలు కారిడార్ల రూపకల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా అడుగులు వేస్తున్నాయి. గంటకు 350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే రైళ్లకు అనుగుణంగా ప్రారంభంగా ప్రణాళికలు రూపొందించినప్పటికీ, భవిష్యత్

మిగతా 2లో..

## యథావిధిగా ఇంటర్ ప్రవేశాలు

విద్యార్థుల భవిష్యత్తుకు భంగం కలగకుండా ప్రభుత్వ నిర్ణయం… 11, 12 తరగతుల విధానంపై ఇంకా అధ్యయనం
శాసనసభ చర్చ తర్వాతే తుది నిర్ణయం… సీఎం రేవంత్ రెడ్డి

2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## తెలంగాణ అభివృద్ధి ప్రాజెక్టులకు
# కేంద్ర సహకారం కోరిన ముఖ్యమంత్రి

(మొదటి పేజీ తరువాయి)




తెలంగాణకు సంబంధించిన రీజినల్ రింగ్ రోడ్, మెట్రో రైలు విస్తరణ, మూసీ నది పునరుజ్జీవం, రేడియల్ రోడ్లు, హైదరాబాద్ మచిలీపట్నం 12 వరుసల రహదారి వంటి కీలక ప్రతిపాదనలు కేంద్రం ముందుంచామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తాను పలుమార్లు ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిశానని, కొన్ని ప్రాజెక్టులకు అత్యవసర ఆమోదాలు అవసరమని పేర్కొన్నారు. రెండు గంటల సమయం కేటాయించి తెలంగాణ ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించాలని ప్రధానమంత్రిని కోరారు. దేశ అభివృద్ధి విషయంలో తెలంగాణ కేంద్రంతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాల ప్రకారం దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగాలని ప్రధానమంత్రి నిర్దేశించారని, అందులో తెలంగాణ నుంచి దేశ జీడీపీకి 10 శాతం వాటా అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. తెలంగాణ రైజింగ్ కార్యక్రమానికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందనే నమ్మకం తమకు ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో వరంగల్‌లో ఏర్పాటు చేసిన పీఎం మిత్రా పార్కును ముఖ్యమంత్రి, గవర్నర్‌తో కలిసి ప్రధానమంత్రి ప్రారంభించారు. అలాగే సంగారెడ్డి జహీరాబాద్ పారిశ్రామిక కారిడార్, మహబూబ్‌నగర్ గూడబెల్లూరు జాతీయ రహదారి, కాజిపేట విజయవాడ బహుళ రైల్వే ట్రాక్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ మల్కాపూర్‌లో నిర్మించిన ఇండియన్ ఆయిల్ గ్రీన్‌ఫీల్డ్ టెర్మినల్ను జాతికి అంకితమిచ్చారు.

# హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరుకు బుల్లెట్ రైలు

(మొదటి పేజీ తరువాయి)

అవసరాలను దృష్టిలో ఉంచుకుని గంటకు 600 కిలోమీటర్ల వేగాన్ని తట్టుకునే విధంగా కారిడార్ డిజైన్‌లో మార్పులు చేస్తున్నారు. అయితే రైళ్లు గరిష్ఠంగా గంటకు 320 కిలోమీటర్ల వేగంతోనే నడిచే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్‌అమరావతిచెన్నై హైస్పీడ్ రైల్ మార్గాన్ని అమరావతిలో ప్రతిపాదిత విమానాశ్రయం మీదుగా తీసుకెళ్లేలా మార్గరేఖల్లో మార్పులు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు గత ఏడాది అక్టోబర్‌లోనే రైల్వే అధికారులకు సూచించారు. దీనికి అనుగుణంగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి రైల్వే బోర్డుకు పంపగా, కేంద్ర రైల్వే శాఖ ఆమోదం తెలిపింది. హైదరాబాద్ నుంచి చెన్నై వరకు రెండు ప్రధాన మార్గాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఒక ప్రతిపాదన ప్రకారం శంషాబాద్, బాటసింగారం, నార్కెట్‌పల్లి, ఖమ్మం మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించి అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి విమానాశ్రయం మీదుగా చెన్నై సెంట్రల్ వరకు హైస్పీడ్ రైలు మార్గం ఉండనుంది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం శంషాబాద్, ఫ్యూచర్ సిటీ, దాచేపల్లి మీదుగా అమరావతికి చేరే ప్రత్యామ్నాయ మార్గాన్ని సూచించింది. హైదరాబాద్‌అమరావతిచెన్నై కారిడార్ మొత్తం సుమారు 760 కిలోమీటర్ల మేర ఉండగా, ఇందులో ఆంధ్రప్రదేశ్ పరిధిలోనే దాదాపు 504 కిలోమీటర్లు ఉండనున్నాయి. ఇదే సమయంలో హైదరాబాద్‌బెంగళూరు హైస్పీడ్ కారిడార్‌పై కూడా కీలక చర్చలు కొనసాగుతున్నాయి. ఈ మార్గం శంషాబాద్, భారత్‌సిటీ, మహబూబ్‌నగర్ మీదుగా కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, హిందూపురం మీదుగా బెంగళూరుకు చేరేలా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం మాత్రం మన్ననూర్, సోమశిల రోడ్ మార్గంగా కర్నూలుకు చేరే ప్రత్యామ్నాయ ఎలైన్‌మెంట్‌ను సూచించింది. ఈ కారిడార్ మొత్తం సుమారు 605 కిలోమీటర్లు ఉండగా, అందులో 263 కిలోమీటర్లు ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వస్తాయి. ఈ మార్గాలపై తుది నిర్ణయం కోసం అధికారులు సర్వేలు, సాంకేతిక అధ్యయనాలు కొనసాగిస్తున్నారు. ఇక చెన్నైబెంగళూరు మధ్య 306 కిలోమీటర్ల హైస్పీడ్ రైల్ కారిడార్‌ను కూడా నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, పలమనేరు ప్రాంతాల మీదుగా సుమారు 90 కిలోమీటర్ల మార్గం ఉండనుంది. చిత్తూరు నుంచి తిరుపతికి ప్రత్యేక హైస్పీడ్ లింక్ ఏర్పాటు చేస్తే చెన్నైబెంగళూరు, హైదరాబాద్‌చెన్నై కారిడార్లకు అనుసంధానం కలుగుతుందని సీఎం చంద్రబాబు సూచించినట్లు సమాచారం. ఇటీవల విశాఖపట్నం పర్యటన సందర్భంగా కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్తో చంద్రబాబు ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. చిత్తూరుతిరుపతి హైస్పీడ్ లింక్‌ను పరిశీలిస్తామని రైల్వే మంత్రి వెల్లడించారు. అదేవిధంగా విజయవాడ నుంచి విశాఖపట్నం వరకు హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రతిపాదనను కూడా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తెచ్చింది. దేశవ్యాప్తంగా ప్రతిపాదించిన ఏడు హైస్పీడ్ కారిడార్ల పనులు పూర్తి అయిన తర్వాత విజయవాడవిశాఖ మార్గాన్ని తదుపరి దశలో పరిశీలిస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

# యథావిధిగా ఇంటర్ ప్రవేశాలు

**హైదరాబాద్, మే 10 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో ఇంటర్‌మీడియట్ ప్రవేశాలను ఈ విద్యా సంవత్సరంలో యథావిధిగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇంటర్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియలో ఇంకా పలు సాంకేతిక సమస్యలు కొనసాగుతున్న నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి ఆటంకం కలగకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. అడ్మిషన్లకు సమయం తక్కువగా ఉండటంతో ఆలస్యం చేయవద్దని అధికారులను ఆదేశించారు.

తెలంగాణ విద్యా కమిషన్ ఇప్పటికే ఇంటర్‌మీడియట్ వ్యవస్థను రద్దు చేసి, కేంద్ర మాధ్యమిక విద్యా మండలి విధానంలో 11, 12 తరగతులను అమలు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ మార్పుతో విద్యార్థులు పదో తరగతి తర్వాత చదువును మధ్యలోనే నిలిపివేయకుండా కొనసాగించే అవకాశాలు పెరుగుతాయని కమిషన్ అభిప్రాయపడింది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పూర్తిచేసిన అనేక మంది విద్యార్థులు వేరు జూనియర్ కళాశాలల్లో చేరకుండా విద్యను ఆపేస్తున్న పరిస్థితి ఉందని నివేదికలో పేర్కొంది.

దేశంలోని చాలా రాష్ట్రాలు ఇప్పటికే 11, 12 తరగతుల విధానాన్ని అమలు చేస్తుండగా తెలంగాణలో మాత్రం ఇంటర్‌మీడియట్ ప్రత్యేక విధానంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇంటర్‌ను పాఠశాల విద్యలో భాగంగా మార్చాలని ముఖ్యమంత్రి గతంలోనే అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ విద్యా కమిషన్ కూడా తన నివేదికలో ప్రస్తావించింది.

ఇటీవల ఇంటర్ ప్రవేశాలను నిలిపివేస్తూ వచ్చిన ప్రకటనతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమైంది. దీనిపై ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విద్యార్థుల విద్యా సంవత్సరం దెబ్బతినకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

ఇంటర్ విలీన ప్రక్రియలో ఉన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించింది. విద్యావేత్తలు, అధికారులు, విద్యార్థి సంఘాలు సహా అన్ని వర్గాలతో విస్తృత స్థాయిలో చర్చలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తెలంగాణ విద్యా విధానంపై నియమించిన కమిటీ ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని ప్రభుత్వం సూచించింది. ఆ నివేదికపై శాసనసభలో విస్తృత చర్చ నిర్వహించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అప్పటి వరకు ఈ విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రవేశాలు సాధారణ విధానంలో కొనసాగనున్నాయి.

# సింధు ఆసుపత్రిని ప్రారంభించిన ప్రధాని మోదీ

- ఆరోగ్య రంగంలో కీలక ముందడుగని ప్రశంస
- అత్యాధునిక సాంకేతికతపై ప్రధాని అభినందనలు
- హైదరాబాద్‌లో వైద్య మౌలిక సదుపాయాలకు ఊతం




**హైదరాబాద్, మే 10 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సింధు ఆసుపత్రిను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆరోగ్య సేవలకు మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసే దిశగా ఇది ఒక ప్రశంసనీయమైన ప్రయత్నమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమ వేదికగా స్పందించిన ప్రధాని మోదీ, ఆసుపత్రి బృందాన్ని అభినందించారు. అత్యాధునిక సాంకేతికతతో పాటు వినూత్న ఆవిష్కరణలను వైద్య సేవల్లో సమన్వయం చేయడంపై ఆసుపత్రి ప్రత్యేక దృష్టి పెట్టడం అభినందనీయమని తెలిపారు.

సింధు ఆసుపత్రి ప్రారంభంతో హైదరాబాద్‌లో వైద్య సేవలు మరింత విస్తరించే అవకాశం ఉందని వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అత్యాధునిక చికిత్సా సౌకర్యాలు, నిపుణుల వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో రోగులకు మెరుగైన సేవలు లభించే అవకాశముందని చెబుతున్నారు. ఇటీవల ఆరోగ్య రంగంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా వైద్య మౌలిక వసతుల విస్తరణకు ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో సింధు ఆసుపత్రి ప్రారంభం ప్రాధాన్యత సంతరించుకుంది.

# తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అండగా ఉంటుంది

(మొదటి పేజీ తరువాయి)

దేశం కూడా వికసిస్తుందని ప్రధాని పేర్కొన్నారు.

సైబరాబాద్ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని మోదీ అన్నారు. ఐటీ, సైబర్ టెక్నాలజీ, విద్యుత్, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతోందని కొనియాడారు. అనేక భారీ ప్రాజెక్టులకు కేంద్రంగా సైబరాబాద్ ఎదుగుతోందని చెప్పారు. అలాగే వరంగల్‌లో ప్రారంభించిన పీఎం మిత్ర పార్క్ టెక్స్‌టైల్ రంగంలో కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేస్తుందని తెలిపారు. రైల్వే రంగంలో తెలంగాణకు గతంతో పోలిస్తే భారీగా నిధులు పెంచినట్లు ప్రధాని వెల్లడించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో రైల్వే బడ్జెట్‌లో వెయ్యి కోట్ల రూపాయలు కూడా దక్కేవి కాదని, ప్రస్తుతం ఒక్క తెలంగాణకే రూ.5,500 కోట్లకు పైగా కేటాయిస్తున్నామని చెప్పారు. జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, తెలంగాణ కూడా దాని ప్రయోజనాలు పొందుతోందని పేర్కొన్నారు.

ప్రధాని పర్యటనలో భాగంగా పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్‌పనాజీ ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా గుడెబల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి, కాజీపేటవిజయవాడ మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టు, కాజీపేట రైల్ అండర్ బైపాస్ లైన్, వరంగల్ పీఎం మిత్ర పార్క్, మల్కాపూర్‌లో ఇండియన్ ఆయిల్ గ్రీన్ ఫీల్డ్ టెర్మినల్ వంటి ప్రాజెక్టులను ప్రారంభించారు. అంతకుముందు బేగంపేట విమానాశ్రయంకు చేరుకున్న ప్రధాని మోదీకి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్తో పాటు పలువురు నేతలు ఘన స్వాగతం పలికారు. ప్రధాని పర్యటన సందర్భంగా నగరంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

# పీఎంజీ జ్యువెల్లరీ దొంగతనం కేసులో కీలక పురోగతి

- పశ్చిమ బెంగాల్‌లో ఒక నిందితుడి అరెస్ట్
- సీసీటీవీ ఆధారాలతో దొంగల జాడ గుర్తించిన పోలీసులు
- అంతర్రాష్ట్ర ముఠా ప్రమేయంపై అనుమానాలు

**కరీంనగర్, మే 10 (తెలంగాణ ముచ్చట్లు):** పట్టణంలో సంచలనం సృష్టించిన పీఎంజీ జ్యువెల్లరీ షాపులో భారీ దొంగతనం కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కరీంనగర్ పోలీసులు గత కొన్ని రోజులుగా విస్తృత దర్యాప్తు చేపట్టగా, తాజాగా పశ్చిమ బెంగాల్‌లో ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. దొంగతనం జరిగిన నాటి నుంచి ప్రత్యేక బృందాలు సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించాయి. విచారణలో నిందితులు పశ్చిమ బెంగాల్‌లో తలదాచుకున్నట్లు గుర్తించిన పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఒక నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.


పోలీసుల ప్రాథమిక విచారణలో దొంగిలించిన బంగారాన్ని ఇప్పటికే పశ్చిమ బెంగాల్‌లోని పలు ప్రాంతాల్లో విక్రయించినట్లు వెల్లడైనట్లు సమాచారం. ఈ దొంగతనానికి అంతర్రాష్ట్ర ముఠా సంబంధాలు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దోపిడీకి ముందుగానే పక్కా ప్రణాళిక సిద్ధం చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. పట్టుబడిన నిందితుడి నుంచి కీలక సమాచారం సేకరించిన పోలీసులు పరారీలో ఉన్న మిగిలిన సభ్యుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. త్వరలోనే మొత్తం ముఠాను పట్టుకుంటామని అధికారులు తెలిపారు.

ఈ కేసు కరీంనగర్‌లో తీవ్ర కలకలం రేపింది. భారీ విలువైన బంగారం చోరీ కావడంతో వ్యాపార వర్గాల్లో ఆందోళన నెలకొంది. దర్యాప్తులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని పోలీసులు చెబుతున్నారు.

# హంటా వైరస్‌పై ఆందోళన అవసరమా?

**హైదరాబాద్, మే 10 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం హంటా వైరస్ పేరు చర్చనీయాంశంగా మారింది. అట్లాంటిక్ మహాసముద్రంలోని ఓ క్రూయిజ్ నౌకలో ఈ వైరస్ వెలుగుచూడడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కరోనా తరహాలో మరో కొత్త వైరస్ వ్యాప్తి చెందుతుందా అనే భయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఈ వైరస్ గురించి పూర్తి వివరాలను ఉస్మానియా మెడికల్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్, సూక్ష్మజీవ శాస్త్ర నిపుణురాలు డాక్టర్ శశికళ వెల్లడించారు. హంటా వైరస్‌కు దక్షిణ కొరియాలోని హంటా నది పేరు ఆధారంగా ఈ పేరు వచ్చినట్లు నిపుణులు తెలిపారు. ఈ వైరస్ ప్రధానంగా ఎలుకలు, పందికొక్కులు, ఉడుతలు వంటి చిన్న జంతువుల్లో ఉంటుంది. వాటి మూత్రం, లాలాజలం లేదా మలం మనుషుల శరీరానికి నేరుగా తగిలితే వైరస్ సోకే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిన 'హంటా ఆండిస్' రకం వైరస్ ప్రమాదకరమైందిగా గుర్తించబడిందని వివరించారు. హంటా వైరస్ బారిన పడిన వారిలో జ్వరం, న్యూమోనియా లక్షణాలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కనిపిస్తాయని నిపుణులు తెలిపారు. వ్యాధి తీవ్రత పెరిగితే ఊపిరితిత్తుల్లో నీరు చేరే ప్రమాదం కూడా ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం ఈ వైరస్‌కు ప్రత్యేక యాంటీ వైరల్ మందులు లేవని, లక్షణాలకు అనుగుణంగా మాత్రమే చికిత్స అందిస్తారని వివరించారు. కొందరిలో మరణ ప్రమాదం 40 నుంచి 50 శాతం వరకు ఉండొచ్చని తెలిపారు. వైద్యుల ప్రకారం ఎలుకలు, అడవి జంతువులతో ఎక్కువగా సంబంధం ఉన్నవారిలో ఈ వైరస్ వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి. అలాంటి ప్రాంతాల్లో పని చేసే వారు తప్పనిసరిగా మాస్క్‌లు, చేతి దస్తానాలు ఉపయోగించాలని సూచిస్తున్నారు. ప్రారంభ దశలోనే పరీక్షల ద్వారా గుర్తిస్తే ఐసోలేషన్‌లో ఉంచి వ్యాప్తిని నియంత్రించవచ్చని చెప్పారు. ఆర్‌టీపీసీఆర్, యాంటీబాడీ పరీక్షల ద్వారా ఈ వైరస్‌ను గుర్తించే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం భారతదేశంలో హంటా వైరస్ కేసులు నమోదు కాలేదని, ప్రజలు అనవసరంగా భయపడాల్సిన అవసరం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పరిశుభ్రత పాటించడం, ఎలుకల నివాస ప్రాంతాలకు దూరంగా ఉండటం, జంతువుల మలం, మూత్రంతో నేరుగా సంబంధం లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ వైరస్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## తాటికాయలలో ఘనంగా
# మాతృదినోత్సవ వేడుకలు

**మాతృమూర్తులకు చీరలు పంపిణీ చేసిన నాయకులు**

**ధర్మసాగర్,మే10(తెలంగాణ ముచ్చట్లు):**

ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామంలో మాతృదినోత్సవ వేడుకలను మాజీ ఉపసర్పంచ్ బొల్లెపాక కుమార్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు బొల్లెపాక అనిత సంపత్, పట్ల రమేష్, పట్ల యాదమ్మ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, యువత, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ ననుబాల సోమక్క చంద్రమౌళి మాట్లాడుతూ తల్లి ప్రేమకు ఈ ప్రపంచంలో ప్రత్యామ్నాయం లేదన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో తల్లి చేసే త్యాగం అమూల్యమని పేర్కొన్నారు. కుటుంబాన్ని సక్రమంగా నడిపిస్తూ పిల్లలకు మంచి సంస్కారాలు నేర్పించే తల్లులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మాతృదినోత్సవం వంటి కార్యక్రమాలు సమాజంలో తల్లుల పట్ల గౌరవాన్ని మరింత పెంచుతాయని తెలిపారు.

విశిష్ట అతిథిగా పాల్గొన్న మాజీ సర్పంచ్ పెసరు రమేష్ మాట్లాడుతూ తల్లి అనేది కుటుంబానికి బలమైన ఆధారం అని అన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో కష్టాలను భరిస్తూ కుటుంబాన్ని ముందుకు నడిపించే ప్రతి తల్లికి సమాజం రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. తల్లుల సేవలను గుర్తు చేసుకునే రోజు మాత్రమే కాకుండా ప్రతిరోజూ తల్లిని గౌరవించాలని సూచించారు.

సభాధ్యక్షులు మాజీ ఉపసర్పంచ్ బొల్లెపాక కుమార్ మాట్లాడుతూ గ్రామంలో మహిళలకు, తల్లులకు గౌరవం కల్పించే ఉద్దేశంతో మాతృదినోత్సవ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. తల్లి ప్రేమ, ఆమె త్యాగం గురించి యువతరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ మహిళలను సన్మానించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మాతృదినోత్సవ వేడుకల్లో భాగంగా కేక్‌ను కట్ చేశారు. అనంతరం గ్రామంలోని మహిళలందరికీ చీరలను పంపిణీ చేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహిళలు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెసరు శివకృష్ణ, కుల పెద్దలు, ఉపదేశి పట్ల శ్రీనివాస్, యువజన సంఘాల నాయకులు బొల్లెపాక నర్సయ్య, ఎర్ర ప్రకాష్,శ్యామ్, రమేష్, పట్ల ప్రవీణ్, శ్రీకాంత్, రవి, నవీన్, ఎర్ర స్వప్న, పట్ల జ్యోత్స్నా తదితరులు పాల్గొన్నారు.





# మూడు దశాబ్దాల తర్వాత కలిసిన మిత్రులు...
## జ్ఞాపకాల జల్లు కురిసిన ఆత్మీయ వేళ

**హుజురాబాద్, మే 10(తెలంగాణ ముచ్చట్లు ):**

కాలం పరుగులు తీసినా... జీవితాలు ఎన్నో మలుపులు తిరిగినా... పాఠశాల రోజుల స్నేహం మాత్రం ఎప్పటికీ చెదరదనే విషయాన్ని హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 199597 ఇంటర్మీడియట్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు మరోసారి నిరూపించారు. మూడు దశాబ్దాల తర్వాత ఒకేచోట కలుసుకున్న మిత్రుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఒకప్పుడు ఒకే తరగతి గదిలో పాఠాలు విన్న వారు, ఒకే బెంచ్‌పై కూర్చొని భవిష్యత్ కలలు కనిన వారు... ఇప్పుడు జీవితాల్లో స్థిరపడి మళ్లీ కలుసుకోవడంతో ఆ ప్రాంగణం భావోద్వేగాలతో నిండిపోయింది.

చిన్ననాటి అల్లరులు, క్లాస్‌రూమ్ జ్ఞాపకాలు, ఉపాధ్యాయుల మాటలు, కాలేజీ రోజుల మధురానుభూతులను గుర్తు చేసుకుంటూ మిత్రులు క్షణాల్లోనే పాత రోజుల్లోకి వెళ్లిపోయారు. కొందరి కళ్లలో ఆనందభాష్పాలు మెరిసాయి. “కాలం మారినా... స్నేహం మారలేదు” అంటూ ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు.

ఈ ఆత్మీయ సమ్మేళనానికి హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని ముఖ్య అతిథిగా హాజరై పూర్వ విద్యార్థులను అభినందించారు. సమాజంలో ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్నా తమ మూలాలను, స్నేహాలను మరువకుండా ఇలాంటి సమావేశాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ ఎస్పీ పుల్ల కరుణాకర్, ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి బొల్లం తిరుపతి, ఒరుగంటి తిరుపతి, బుర్ర స్వామిగౌడ్, పడకొండ అనిల్ కుమార్, నడిగడ్డ రాజు, బుర్ర తిరుపతి,రొంటాల సుధీర్ తదితరులు పాల్గొని పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమం మొత్తం నవ్వులు, ఆప్యాయ పలకరింపులు, భావోద్వేగ క్షణాలతో హృద్యంగా సాగింది.

30 సంవత్సరాల తర్వాత జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న బుర్ర తిరుపతి గారు భావోద్వేగంతో మాట్లాడారు. పాఠశాల రోజుల జ్ఞాపకాలు, స్నేహితులతో గడిపిన మధుర క్షణాలు జీవితాంతం గుర్తుండిపోతాయని తెలిపారు. ఎన్నో ఏళ్ల తర్వాత అందరూ కలవడం ఎంతో ఆనందంగా ఉందని, పాత స్నేహాలు మళ్లీ గుర్తుకువచ్చాయని పేర్కొన్నారు.



# బీసీ కులగణన చేపట్టాలని గన్‌పార్క్ వద్ద నిరసన

**నల్ల బ్యాడ్జీలు, నల్ల జెండాలతో ఆందోళన**
**కేంద్ర ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్**
**పాల్గొన్న బీసీ సంఘాల భారీ నేతలు**

**హైదరాబాద్, మే 10 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్న సందర్భంగా దేశవ్యాప్తంగా చేపట్టబోయే జనగణనలో బీసీ కులగణన నిర్వహించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద బీసీ సంఘాల నేతలు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు, నల్ల జెండాలతో శాంతియుతంగా ఆందోళన చేపట్టి కేంద్ర ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో దేశ జనగణనలో బీసీ కులగణన చేపడతామని హామీ ఇచ్చిందని, కానీ ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీల కులగణన చేపట్టకపోవడం మోసపూరిత చర్య అని ఆరోపించారు. బీసీల జనాభా, వారి సామాజిక పరిస్థితులపై స్పష్టమైన వివరాలు రావాలంటే కులగణన తప్పనిసరిగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదన చారి, బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, కోదండరాం, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, గుజ్జ కృష్ణ పాల్గొన్నారు. బీసీల హక్కుల పరిరక్షణ కోసం కేంద్రం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. బీసీ సంఘాల నాయకులు కుల్కచర్ల శ్రీనివాస్, విక్రమ్ గౌడ్, మణిమంజరితో పాటు పలువురు కార్యకర్తలు ఈ నిరసనలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని నినాదాలు చేశారు. నిరసనకారులు మాట్లాడుతూ దేశంలో సామాజిక న్యాయం సాధించాలంటే బీసీ కులగణన కీలకమని పేర్కొన్నారు. జనాభాకు అనుగుణంగా అవకాశాలు, సంక్షేమ పథకాలు అందించాలంటే ఖచ్చితమైన గణాంకాలు అవసరమని తెలిపారు. బీసీ కులగణన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# జమ్మికుంట యువత ఆధ్వర్యంలో ఎస్ఐ సతీష్‌కు ఘన సన్మానం




**జమ్మికుంట టౌన్ మే 10 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణ ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందిన ఎస్ఐ సతీష్‌కు జమ్మికుంట యువత ఆదివారం ఘన సన్మానం నిర్వహించింది. ఇటీవల ఆయన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌కు బదిలీ కావడంతో యువత ప్రత్యేకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ, ఎస్ఐ సతీష్ విధుల్లో క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండేవారని ప్రశంసించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు యువతతో సత్సంబంధాలు కొనసాగిస్తూ వారికి ప్రోత్సాహం అందించారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు.

మిరుదొడ్డిలో కూడా అదే సేవాభావంతో పనిచేసి మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ యువత ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట యువతకు చెందిన పాతకాల ప్రవీణ్, సింగిరెడ్డి రంజిత్ రెడ్డి, రాజకుమార్, అంబాలా అరుణ్, నాగరాజు, వెంకటేష్, ప్రకాష్ రాజ్, సంతోష్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవంగా కోరపల్లి మత్స్యకారుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



**జమ్మికుంట టౌన్ మే 10 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు ఆదివారం ప్రశాంత వాతావరణంలో జరిగి ఏకగ్రీవంగా ముగిశాయి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎన్నికల నోటిఫికేషన్ మేరకు నిర్వహించిన ఈ ఎన్నికల్లో గ్రామ పెద్దలు, సంఘ సభ్యులు సమన్వయంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది.

సంఘం అధ్యక్షునిగా పింగిలి రమేష్ (స్వామి కుమారుడు), ఉపాధ్యక్షునిగా టంగుటూరి రామ్మోహన్, కార్యదర్శిగా మద్దెర్ల రమేష్ బాధ్యతలు చేపట్టనున్నారు. డైరెక్టర్లుగా కొండవేనా పోషాలు, టంగుటూరి సంజీవ్, పింగిలి సంపత్, టంగుటూరి ఉమేష్, తీగల మల్లేష్, టంగుటూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

ఎన్నికల ప్రక్రియను జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీమతి అరుణ జ్యోతి ఎన్నికల అధికారిగా పర్యవేక్షించి విజయవంతంగా నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమం కోసం నూతన కమిటీ కృషి చేయాలని గ్రామస్థులు ఆకాంక్షించారు. ఎన్నికైన సభ్యులకు గ్రామ ప్రజలు, మత్స్యకార సంఘ సభ్యులు ఘనంగా అభినందనలు తెలియజేశారు.

# మోదీ సభ విజయానికి గంట సంపత్ కృషి బోర్నపల్లి నుండి తరలిన బీజేపీ శ్రేణులు



**హుజురాబాద్, మే 10(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయడంలో బోర్నపల్లి బీజేపీ నాయకుడు గంట సంపత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. సభకు పెద్ద ఎత్తున కార్యకర్తలను సమీకరించి పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు.

గంట సంపత్ ఆధ్వర్యంలో ఆదివారం బోర్నపల్లినుంచి ప్రత్యేక బస్సులో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు భారీగా హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మోదీకి మద్దతుగా నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ప్రయాణం ప్రారంభించారు.

ఈ సందర్భంగా గంట సంపత్ మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న నాయకుడు నరేంద్ర మోదీ అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి వర్గ ప్రజలకు చేరుతున్నాయని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంపై ప్రజల్లో విశ్వాసం రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభ చారిత్రాత్మక విజయంగా నిలవాలని, తెలంగాణలో బీజేపీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

# పరేడ్ గ్రౌండ్ వైపు కదిలిన కమల దళం



**ఎల్కతుర్తి, మే 10 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలం లోని కార్యకర్తలు, ప్రజలు దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొంటున్న భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మండల అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో కమల దళం ఉత్సాహంగా వాహనాల్లో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌కు బయలుదేరింది. పార్టీ జెండాలు, నినాదాలతో కార్యకర్తలు ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రధాని మోడీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందన్నారు. మోడీ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వినేందుకు యువత, మహిళలు, పార్టీ కార్యకర్తలు స్వచ్ఛందంగా భారీ సంఖ్యలో తరలివస్తున్నారని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా కార్యకర్తలు సభకు చేరుకోగా, సభ విజయవంతం కావాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి ముఖ్య నాయకులు, యువమోర్చా ప్రతినిధులు, మహిళా కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

# రైల్వే కోచ్ ఫ్యాక్టరీలోస్థానికులకు 80% ఉద్యోగాలు ఇవ్వాలి



కాజీపేట్ మే 10 ( తెలంగాణ ముచ్చట్లు)

కాజీపేట్ జంక్షన్ సమీపంలోనీ అయోధ్యపురం గ్రామంలో నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో భూమిని కోల్పోయిన భూ నిర్వాసితులతో పాటు అప్రెంటిస్ చేసిన ఐటిఐ విద్యార్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని సిపిఎం కాజీపేట మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య ఆధ్వర్యంలో కాజీపేట్ రైల్వే ఎస్ ఆర్ ఎం యూనియన్ ఆఫీస్ నుండి కాజీపేట్ చౌరస్తా వరకు ప్రజాసంఘాల ఐక్యవేదిక, సెంటర్ ఆఫ్ ఇండియా ట్రేడ్ యూనియన్, భారత కమ్యూనిస్టు పార్టీలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాజీపేట్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓరుగంటి సాంబయ్య మాట్లాడుతూ భూ నిర్వాసితులకు భూమి ఇచ్చే ముందు ఇంటికో ఉద్యోగం ఇస్తామని తెలిపారు. కానీ ఆ మాటే ఇప్పుడు ఎత్తడం లేదు అని ఆరోపించారు. రైల్వే యాక్ట్ ప్రకారం స్థానికులకు 80% ఉద్యోగాలు ఇవ్వాలని ఉంది, కానీ ప్రభుత్వం కానీ రైల్వే అధికారులు కానీ ఏటువంటి హామీలు ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. స్థానిక రైల్వే అధికారులకు ఎమ్మార్వో, ఆర్డీవో, జిల్లా కలెక్టర్ కు పలుమార్లు వినతి పత్రాన్ని ఇచ్చిన సమస్య పరిష్కారానికి ఎవరు చొరవ చూపడం లేదన్నారు. ప్రధాని మోడీ హైదరాబాదుకు వస్తున్న సందర్భంగా అతనికి దృష్టికి తీసుకెళ్లేందుకు రాస్తారోకో చేస్తున్నామన్నారు. కోచ్ ఫ్యాక్టరీలో కార్మికులకు ఐటిఐ అప్రెంటిస్ చేసిన వారికి భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవన్నీ పక్షంలో త్వరలో నిరసన దీక్షలను ప్రారంభిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జరిపోతుల సాంబయ్య బిక్షపతి చుక్కయ్య విలాసాగర్ ప్రదీప్ చంపల రమేష్ వెంకటేష్ లతోపాటు ప్రజా సంఘాల నాయకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గం : మిల్కూరి వాసుదేవరెడ్డి



**హుజురాబాద్, మే 10(తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం కొంకటి చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, తేమ పేరుతో కోతలు, గన్నీ సంచుల కొరత, రైతులకు సరైన మద్దతు ధర అందకపోవడం వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి, కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు.

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని రైతులకు, పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. రైతుల పక్షాన సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో పార్టీ నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అదనపు కట్నం కోసం వేధింపులు...భర్త సహా నలుగురిపై కేసు నమోదు

**జమ్మికుంట టౌన్ మే 10 (తెలంగాణ ముచ్చట్లు):** అదనపు కట్నం తీసుకురావాలని వివాహితను శారీరకంగా, మానసికంగా వేధించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలు ఇగ్గేటి అనూష తెలిపిన వివరాల ప్రకారం, ఆమెకు గత సంవత్సరం ఉల్లంపల్లి గ్రామానికి చెందిన బుల్లి అజయ్‌కుమార్‌తో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో ఆమె తల్లిదండ్రులు ఒక ఎకరం భూమి, రూ.8 లక్షల నగదు, ఇతర లాంఛనాలతో ఘనంగా పెళ్లి జరిపించినట్లు పేర్కొన్నారు. పెళ్లి అనంతరం కొంతకాలం దంపతులు సఖ్యంగా ఉన్నప్పటికీ, అనంతరం భర్త అజయ్‌కుమార్ మద్యం అలవాటుకు బానిసై తరచూ దుర్భాషలాడుతూ వేధించేవాడని ఫిర్యాదులో తెలిపారు. ఈ విషయాన్ని అత్త బుల్లి రామ, మామ కొమురయ్య, బావ రంజిత్, ఆరాలు మమత దృష్టికి తీసుకెళ్లినా వారు భర్తకు మద్దతుగా నిలిచి, అదనపు కట్నంగా రూ.5 లక్షలు తీసుకురావాలని ఒత్తిడి చేశారని ఆరోపించారు. డబ్బు తీసుకురాకపోతే ఇంట్లో ఉండనివ్వమని బెదిరిస్తూ శారీరక, మానసిక వేధింపులకు గురిచేసి ఇంటి నుంచి పంపించివేశారని బాధితురాలు పేర్కొన్నారు. ఈ విషయమై ఈ ఏడాది ఏప్రిల్ 22న పెద్దలు మూగల పరుశురాం, కంకాల కుమారస్వామి సమక్షంలో పంచాయతీ జరిగినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాలేదని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్తతో పాటు కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఫ్లోరిడాలో చార్టర్ బోటులో భారీ పేలుడు

**వాషింగ్టన్, మే 10 (తెలంగాణ ముచ్చట్లు):** అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో భారీ బోటు పేలుడు సంభవించింది. మియామి నగర సమీపంలోని బిస్కేన్ బేలో శనివారం జరిగిన ఈ ప్రమాదంలో ఒక చిన్నారితో పాటు మొత్తం 11 మంది గాయపడ్డారు. పర్యాటకులకు ప్రసిద్ధి చెందిన హాలోవర్ సాండ్‌బార్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 'నాటీ నేబర్స్' పేరుతో ఉన్న 40 అడుగుల చార్టర్ బోటులో సుమారు 14 మంది ప్రయాణిస్తున్న సమయంలో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. పేలుడు తీవ్రతకు బోటులో ఉన్న ప్రయాణికులు గాల్లోకి ఎగిరి నీటిలో పడిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనతో అక్కడ ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి.

సమాచారం అందుకున్న వెంటనే మియామిడేడ్ ఫైర్ రెస్క్యూ, యూఎస్ కోస్ట్ గార్డ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ప్రమాద తీవ్రతను దృష్టిలో పెట్టుకుని దీనిని 'లెవెల్ 2 మాస్ క్యాజువాలిటీ' ఘటనగా ప్రకటించారు. గాయపడిన వారిలో కొందరికి తీవ్ర కాలిన గాయాలు కాగా, మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయని అధికారులు వెల్లడించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం బోటు ఇంజిన్‌ను ప్రారంభించే సమయంలో గ్యాస్ లీకేజీ జరిగి పేలుడు సంభవించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. బోటు కెప్టెన్ భద్రతా నిబంధనల ప్రకారం బ్లోయర్లను ఆన్ చేయకుండానే ఇంజిన్ స్టార్ట్ చేశాడని ఒక ప్రత్యక్ష సాక్షి ఆరోపించారు. ఈ ఘటనపై ఫ్లోరిడా ఫిష్ అండ్ వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ కమిషన్ ప్రధాన దర్యాప్తు సంస్థగా విచారణ చేపట్టింది. అదే సమయంలో యూఎస్ కోస్ట్ గార్డ్ కూడా సమాంతరంగా దర్యాప్తు కొనసాగిస్తోంది. పూర్తి విచారణ అనంతరం పేలుడుకు గల ఖచ్చితమైన కారణాలను వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

# ముఖానికి స్వచ్ఛమైన తేనెతో అందం



సహజసిద్ధమైన పదార్థాల్లో తేనెకు ప్రత్యేక స్థానం ఉంది. ఆరోగ్యానికి మాత్రమే కాదు, చర్మ సంరక్షణలో కూడా తేనె ఎంతో ఉపయోగకరంగా పనిచేస్తుంది. ముఖ్యంగా స్వచ్ఛమైన తేనెను ముఖానికి ఉపయోగించడం వల్ల చర్మం మృదువుగా మారడంతో పాటు సహజ కాంతిని కూడా అందిస్తుంది. ప్రస్తుతం రసాయన పదార్థాలతో తయారైన క్రీముల కంటే సహజ పద్ధతులపై చాలామంది ఆసక్తి చూపుతున్నారు. తేనెలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు మొటిమలను తగ్గించడంలో సహాయపడతాయి. ముఖంపై ఉండే చిన్న మచ్చలు, పొడిబారిన చర్మం సమస్యలను తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. ముఖాన్ని శుభ్రంగా కడిగి స్వల్పంగా తేనె రాసి పది నుంచి పదిహేను నిమిషాలు ఉంచి గోరువెచ్చని నీటితో కడిగితే చర్మం తాజాగా కనిపిస్తుంది. ముఖ్యంగా సాధారణ చర్మం ఉన్నవారికి ఇది మంచి ఫలితాలను ఇస్తుందని నిపుణులు చెబుతున్నారు. తేనెకు కొద్దిగా నిమ్మరసం కలిపి ఉపయోగిస్తే చర్మంపై పేరుకుపోయిన మలినాలు తొలగడానికి సహాయపడుతుంది. అలాగే పెరుగు లేదా అలొవెరాతో కలిపి ఫేస్ ప్యాక్‌లా వాడితే చర్మానికి తేమ పెరుగుతుంది. అయితే సున్నితమైన చర్మం ఉన్నవారు ముందుగా చేతిపై కొద్దిగా పరీక్ష చేసి తరువాతే ముఖానికి ఉపయోగించడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. తేనెను తరచూ ఉపయోగించడం వల్ల చర్మం మృదువుగా మారడమే కాకుండా సహజ కాంతిని కూడా అందిస్తుంది. అయితే నకిలీ తేనె కాకుండా స్వచ్ఛమైన తేనెనే ఉపయోగించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చర్మ సమస్యలు తీవ్రమై ఉంటే స్వయంగా చికిత్సలు చేసుకోవడం కంటే చర్మ వైద్యులను సంప్రదించడం ఉత్తమమని సూచిస్తున్నారు.



# మోదుగాకులో భోజనం.. మరచిపోతున్న ఆరోగ్య సంప్రదాయం

ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా కనిపించిన ఆకుల్లో భోజనం చేసే సంప్రదాయం ఇప్పుడు మళ్లీ ప్రాచుర్యం పొందుతోంది. ముఖ్యంగా మోదుగాకులో అన్నం తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని పెద్దలు చెబుతుండటంతో చాలామంది ఈ పద్ధతిపై ఆసక్తి చూపుతున్నారు. పండుగలు, వనభోజనాలు, దేవాలయ కార్యక్రమాల్లో ఇప్పటికీ మోదుగాకులను ఉపయోగించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. మోదుగ చెట్టుకు ప్రత్యేకమైన ఔషధ గుణాలు ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఈ ఆకుల్లో భోజనం చేయడం వల్ల ఆహారానికి సహజమైన వాసన, రుచి వస్తుందని అంటున్నారు. ముఖ్యంగా వేడి అన్నం ఆకుపై వడ్డించినప్పుడు ఆకులోని కొన్ని సహజ గుణాలు ఆహారంలో కలిసే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇవి జీర్ణ క్రియకు సహాయపడటంతో పాటు శరీరానికి తేలికగా అనిపించేలా చేస్తాయని గ్రామీణ వైద్యులు పేర్కొంటున్నారు.

ప్లాస్టిక్ పాత్రలకు ప్రత్యామ్నాయంగా ఆకులు ప్రస్తుతం ప్లాస్టిక్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సహజ సిద్ధమైన ఆకులను ఉపయోగించడం పర్యావరణానికి కూడా మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. మోదుగాకులు పూర్తిగా సహజసిద్ధమైనవిగా ఉండటంతో వాటివల్ల కాలుష్యం ఉండదని సూచిస్తున్నారు. అందుకే కొన్ని ప్రాంతాల్లో వివాహాలు, శుభకార్యాల్లో మళ్లీ ఆకుల్లో భోజనం పెట్టే సంప్రదాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. మోదుగాకులో భోజనం చేయడం కేవలం ఆరోగ్య పరమైన ప్రయోజనాలకే కాదు, మన పాత సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేసే అంశంగా కూడా భావిస్తున్నారు. పల్లెటూరి వాతావరణం, ప్రకృతి జీవన శైలిని గుర్తు చేసే ఈ పద్ధతిని కొత్త తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉందని పెద్దలు చెబుతున్నారు. అయితే ఆకులు శుభ్రంగా ఉన్నాయో లేదో చూసుకుని మాత్రమే ఉపయోగించడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

# వేసవిలో శరీరానికి చల్లదనం ఇచ్చే సంప్రదాయ పానీయం

ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంట్లో కనిపించే రాగుల జావ ఇప్పుడు ఆరోగ్యకరమైన ఆహారంగా మళ్లీ ప్రాచుర్యం పొందుతోంది. శరీరానికి చల్లదనం ఇవ్వడం, ఎక్కువసేపు శక్తిని అందించడం, పోషకాలు సమృద్ధిగా ఉండటం వల్ల చాలామంది దీన్ని తమ రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకుంటున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో రాగుల జావ తాగడం వల్ల అలసట తగ్గి శరీరం తాజాగా ఉంటుందని పెద్దలు చెబుతున్నారు. రాగుల్లో కాల్షియం, ఇనుము, పీచు పదార్థాలు, ప్రోటీన్లు సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల రాగుల జావ ఎముకల బలానికి ఎంతో మేలు చేస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పిల్లలు, గర్భిణీలు, వృద్ధులకు ఇది మంచి పోషకాహారంగా భావిస్తున్నారు. శరీరానికి కావలసిన శక్తిని నెమ్మదిగా విడుదల చేయడం వల్ల ఎక్కువసేపు ఉత్సాహంగా ఉండటానికి సహాయపడుతుంది. గుల జావలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉండటంతో బరువు నియంత్రణలో కూడా ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. మధుమేహంతో బాధపడేవారికి కూడా ఇది కొంతమేర ప్రయోజనకరంగా ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు. అయితే చక్కెర ఎక్కువగా కలపకుండా తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. ప్రస్తుతం ఫాస్ట్ ఫుడ్, శీతల పానీయాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సహజమైన పానీయాలపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. ఈ క్రమంలో రాగుల జావకు మళ్లీ మంచి ఆదరణ లభిస్తోంది. ఇంట్లో సులభంగా తయారు చేసుకునే ఈ పానీయం ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు సంప్రదాయ ఆహారపు అలవాట్లను కూడా గుర్తు చేస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు.



సోమవారం - 11 - మే 2026

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# తమిళనాడులో కొత్త రాజకీయ అధ్యాయం

**ముఖ్యమంత్రిగా సినీ నటుడు విజయ్ ప్రమాణ స్వీకారం**
**దాదాపు 59 ఏళ్ల తర్వాత ద్రావిడేతర నేతకు అవకాశం**
**కాంగ్రెస్, వామపక్షాల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు**

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత సి. జోసెఫ్ విజయ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం ఉదయం జరిగిన ఘన కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ విజయ్‌తో ప్రమాణం చేయించారు. ఈ పరిణామంతో దాదాపు 59 ఏళ్ల తర్వాత తమిళనాడుకు ఒక ద్రావిడేతర ముఖ్యమంత్రి లభించినట్లైంది. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి దేశ రాజకీయ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు తమిళనాడు భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్, పార్టీ నేత తమిళిసై సౌందరరాజన్ కూడా పాల్గొన్నారు. సినీ, రాజకీయ రంగాలకు చెందిన అనేక మంది ప్రముఖులు ఈ వేడుకకు హాజరై విజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

విజయ్ తల్లిదండ్రులు ఎస్.ఏ. చంద్రశేఖర్, శోభా చంద్రశేఖర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు తన మంత్రివర్గ సహచరులను విజయ్ గవర్నర్‌కు పరిచయం చేశారు. కార్యక్రమ ప్రాంగణం అభిమానులు, పార్టీ కార్యకర్తలతో నిండిపోయి ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం పార్టీ తొలిసారే పోటీ చేసి సంచలన విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 234 స్థానాలున్న అసెంబ్లీలో టీవీకే పార్టీ 108 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్, భారత కమ్యూనిస్టు పార్టీ, మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ, వీసీకే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ వంటి మిత్రపక్షాల మద్దతుతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. మిత్రపక్షాల మద్దతుతో అసెంబ్లీలో 120 మంది ఎమ్మెల్యేల బలం సాధించిన విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. తమిళనాడులో సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన మరో ప్రముఖ నేతగా విజయ్ ఎదుగుదల ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. రాజకీయ విశ్లేషకులు ఈ పరిణామాన్ని తమిళనాడు రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయంగా అభివర్ణిస్తున్నారు.



## విజయ్ ప్రమాణ స్వీకార వేడుకలో త్రిష సందడి

**చెన్నైలో ఘనంగా జరిగిన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం**
**అభిమానులతో కిక్కిరిసిన జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం**
**కార్యక్రమానికి హాజరైన రాహుల్ గాంధీ**

తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత, ప్రముఖ సినీ నటుడు విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వేడుక ఘనంగా జరిగింది. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాజకీయ, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. అభిమానులు, పార్టీ కార్యకర్తలతో స్టేడియం సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి త్రిష హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె రాకతో అభిమానులు ఉత్సాహం వ్యక్తం చేశారు. సినీ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు కూడా ఈ వేడుకలో పాల్గొని విజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ కూడా హాజరయ్యారు. విజయ్ రాజకీయ ప్రయాణానికి మద్దతుగా పలువురు జాతీయ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విజయ్‌కు అభిమానులు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తక్కువ కాలంలోనే ముఖ్యమంత్రి పదవిని చేపట్టడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.






# అగ్ని-5 క్షిపణి ప్రయోగంలో భారత్ విజయవంతం

భారత రక్షణ రంగంలో మరో కీలక ముందడుగు పడింది. అత్యాధునిక ఎంఐఆర్వీ సాంకేతికతతో రూపొందించిన అగ్ని5 క్షిపణి ప్రయోగాన్ని భారత్ విజయవంతంగా నిర్వహించింది. ఒకే క్షిపణి ద్వారా ఏకకాలంలో పలు లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యాన్ని ఈ పరీక్ష మరోసారి నిరూపించింది. ఈ విజయంతో దేశ రక్షణ సామర్థ్యం మరింత బలపడిందని రక్షణ వర్గాలు వెల్లడించాయి. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి మే 8న ఈ ప్రయోగాన్ని చేపట్టారు. 'మిషన్ దివ్యాస్త్ర'లో భాగంగా నిర్వహించిన ఈ పరీక్షలో అగ్ని5 క్షిపణి హిందూ మహాసముద్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న బహుళ లక్ష్యాలను విజయవంతంగా ఛేదించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. గత ఏడాది మార్చిలో కూడా ఇదే సాంకేతికతతో తొలి విజయవంతమైన పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే.



ఎంఐఆర్వీ సాంకేతికత ద్వారా ఒకే క్షిపణిలో పలు వార్‌హెడ్‌లను అమర్చి, వాటిని వేర్వేరు లక్ష్యాలపైకి పంపే అవకాశం ఉంటుంది. దీంతో ఒకే సమయంలో అనేక లక్ష్యాలను దాడి చేసే సామర్థ్యం లభిస్తుంది. ప్రపంచంలో అత్యాధునిక క్షిపణి సాంకేతికత కలిగిన కొద్ది దేశాల్లో మాత్రమే ఈ సామర్థ్యం ఉంది. తాజా విజయంతో భారత్ కూడా ఆ జాబితాలో తన స్థానాన్ని మరింత బలపరిచింది. క్షిపణి ప్రయోగం నుంచి లక్ష్యాల ఛేదన వరకు మొత్తం ప్రయాణాన్ని భూమి, నౌకల ఆధారిత ట్రాకింగ్ వ్యవస్థల ద్వారా పర్యవేక్షించారు. ఫ్లైట్ డేటా ఆధారంగా అన్ని నిర్దేశిత లక్ష్యాలు విజయవంతంగా నెరవేరినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ ప్రయోగ సమయంలో రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థకు చెందిన సీనియర్ శాస్త్రవేత్తలు, భారత సైనిక సిబ్బంది పాల్గొన్నారు. ఈ విజయంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. డీఆర్డీవో శాస్త్రవేత్తలు, సైన్యం, పరిశ్రమ భాగస్వాములను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో ఈ సాంకేతికత దేశానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. అగ్ని5 క్షిపణి సుమారు 5 వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం కలిగి ఉంది. ఈ తాజా ప్రయోగంతో భారత రక్షణ వ్యవస్థ మరింత ఆధునిక స్థాయికి చేరిందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఉత్తరప్రదేశ్‌లో యోగి మంత్రివర్గ విస్తరణ



ఉత్తరప్రదేశ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలోని భారతీయ జనతా పార్టీ కూటమి ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణ చేపట్టింది. ఆదివారం రాజధాని లక్నోలోని జన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆరుగురు కొత్త మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర గవర్నర్ ఆనందిబెన్ పటేల్ వారికి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా భూపేంద్ర చౌదరి, మనోజ్ పాండే, క్రిష్ణ పాశ్వాన్, కైలాష్ సింగ్ రాజ్‌పుత్, హన్స్‌రాజ్ విశ్వకర్మ, సురేంద్ర దైలర్ మంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు. వీరిలో భూపేంద్ర చౌదరి, మనోజ్ పాండేలకు క్యాబినెట్ హోదా లభించింది. మంత్రివర్గ విస్తరణతో పాటు ఇప్పటికే ఉన్న కొందరు మంత్రులకు పదోన్నతులు కూడా కల్పించారు. అజిత్ సింగ్ పాల్, సోమేంద్ర తోమర్లకు స్వతంత్ర హోదాతో మంత్రిపదవులు ఇచ్చారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సామాజిక, రాజకీయ సమీకరణాలకు అనుగుణంగా ఈ మార్పులు చేసినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈసారి మంత్రివర్గ విస్తరణలో కూటమి పార్టీలకు కూడా ప్రాధాన్యం కల్పించారు. ఓం ప్రకాష్ రాజ్‌బార్ నేతృత్వంలోని పార్టీకి చెందిన నేతలతో పాటు, ఆర్ఎల్‌డీకి చెందిన పలువురికి కూడా అవకాశాలు కల్పించారు. అనిల్ కుమార్, సునీల్ కుమార్ శర్మ, దారా సింగ్ చౌహాన్లకు క్యాబినెట్ పదవులు దక్కడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉండగా, ఈ మంత్రివర్గ విస్తరణపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ విమర్శలు గుప్పించారు. ఇది ప్రజా ప్రయోజనాల కోసం కాకుండా కాలక్షేపం కోసం చేస్తున్న ప్రక్రియగా అభివర్ణించారు. ఎన్నికల ముందు రాజకీయ లాభాల కోసమే బీజేపీ ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించారు.

# ఏఐ ఆధారిత సేవలను ప్రారంభించిన యాక్సిస్ బ్యాంక్

ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ తన కరెంట్ ఖాతాదారుల కోసం సరికొత్త ఏఐ ఆధారిత కంప్లయన్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. బ్యాంకింగ్ నియంత్రణ ప్రక్రియలను వేగవంతం చేయడం, పూర్తిగా డిజిటలైజ్ చేయడం ద్వారా ఖాతాదారులకు మరింత సులభమైన సేవలు అందించడమే ఈ చర్యల ప్రధాన లక్ష్యంగా బ్యాంక్ పేర్కొంది.

ఈ కొత్త వ్యవస్థలో భాగంగా 'ఏఐ ఆధారిత రీకేవైసీ', 'డిజిటల్ బిజినెస్ ప్రొఫైల్ అప్‌డేట్' అనే రెండు కీలక సేవలను ప్రవేశపెట్టింది.

డిజిటల్ బిజినెస్ ప్రొఫైల్ అప్‌డేట్ సేవ ద్వారా వ్యాపార ఖాతాదారులు తమ వ్యాపార వివరాలను ఆన్‌లైన్‌లోనే సులభంగా సవరించుకునే అవకాశం కల్పించారు. ఈ ప్రక్రియలో జనరేటివ్ ఏఐ, రియల్ టైమ్ జీఎస్టీ ఫైలింగ్ డేటాను వినియోగిస్తున్నట్లు బ్యాంక్ వెల్లడించింది.

ఈ సిస్టమ్ 3,000కుపైగా వ్యాపార కోడ్‌లలో సరైన కోడ్‌ను స్వయంచాలకంగా గుర్తించగలదు. దీనివల్ల మాన్యువల్ డేటా ఎంట్రీ అవసరం తగ్గి, తప్పులు జరిగే అవకాశాలు కూడా తగ్గుతాయని బ్యాంక్ తెలిపింది. జీఎస్టీ డేటాతో లార్జ్ లాంగ్వేజ్ మోడల్ టెక్నాలజీని ఈ స్థాయిలో వినియోగించడం ఇదే తొలిసారి అని అధికారులు పేర్కొన్నారు.

అలాగే వ్యక్తిగతేతర కరెంట్ ఖాతాదారుల కోసం ఏఐ ఆధారిత రీకేవైసీ విధానాన్ని కూడా ప్రారంభించారు. గతంలో క్లిష్టంగా, ఎక్కువ సమయం పట్టే ఈ ప్రక్రియ ఇప్పుడు పూర్తిగా ఇంటెలిజెంట్ ఆటోమేషన్ ఆధారంగా పనిచేస్తుంది.

ఒకే పీడీఎఫ్ ఫైల్‌లో ఉన్న పలు కేవైసీ పత్రాలను సిస్టమ్ స్వయంచాలకంగా గుర్తించి, అందులోని సమాచారాన్ని విశ్లేషిస్తుంది. పత్రాల్లో ఏవైనా లోపాలు ఉంటే వెంటనే హెచ్చరికలు జారీ చేస్తుంది. దీంతో ఖాతాదారులు బ్యాంక్ బ్రాంచ్‌కు వెళ్లకుండా, కాగితపు పత్రాల అవసరం లేకుండానే రీకేవైసీ పూర్తి చేసుకునే అవకాశం లభించనుంది.

జనరేటివ్ ఏఐ, డాక్యుమెంట్ ఇంటెలిజెన్స్, రియల్ టైమ్ డేటా సమన్వయంతో బ్యాంకింగ్ ప్రక్రియలను మరింత సులభతరం చేస్తున్నామని బ్యాంక్ అధికారులు తెలిపారు. ఈ సాంకేతిక మార్పుల వల్ల కస్టమర్లకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందడమే కాకుండా, బ్యాంక్ ఆపరేషనల్ బృందాల పనిభారం కూడా గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు.



# ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తుల ధరలు పెరిగే సూచనలు

దేశంలోని ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ సంస్థలు త్వరలో తమ ఉత్పత్తుల ధరలను పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రముఖ సంస్థ డాబర్ ఇండియా వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం నుంచి ధరల పెంపుపై ఆలోచిస్తున్నట్లు సంకేతాలు ఇచ్చింది.

డాబర్‌తో పాటు హిందుస్థాన్ యూనీలీవర్, నెస్లే, బ్రిటానియా వంటి దిగ్గజ కంపెనీలు కూడా ఇదే దారిలో వెళ్లే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడి సరుకుల ధరలు, ప్యాకేజింగ్ వ్యయాలు ఈ నిర్ణయానికి ప్రధాన కారణాలుగా పేర్కొంటున్నారు. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు కూడా ఖర్చుల పెరుగుదలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్ - అమెరికా మధ్య నెలకొన్న పరిస్థితుల కారణంగా ముడి చమురు సరఫరాపై ప్రభావం పడుతోంది. దీనివల్ల రవాణా వ్యయాలు పెరగడంతో పాటు ప్లాస్టిక్ ప్యాకేజింగ్ పదార్థాల ధరలు కూడా భారీగా పెరిగినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

బిస్కెట్లు, వంటనూనెలు, పాలు, కాఫీ, టీ పొడి వంటి ఉత్పత్తుల తయారీలో ఉపయోగించే ముడి సరుకుల ధరలు నిరంతరం పెరుగుతుండటంతో కంపెనీలపై అదనపు భారం పడుతోంది.

ఇక గ్రామీణ మార్కెట్‌లో డిమాండ్ క్రమంగా పుంజుకోవడం కూడా కంపెనీల నిర్ణయాలపై ప్రభావం చూపుతోంది. గత కొన్ని త్రైమాసికాలుగా మందగించిన గ్రామీణ వినియోగం ఇప్పుడు తిరిగి పెరుగుతున్నప్పటికీ, పెరుగుతున్న తయారీ వ్యయాల కారణంగా లాభాలను కాపాడుకోవడానికి ధరల పెంపు అవసరమవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు.

ధరల పెరుగుదల ప్రభావం పలు నిత్యావసర ఉత్పత్తులపై పడే అవకాశం ఉంది. ముఖ్యంగా సబ్బులు, షాంపూలు, డిటెర్జెంట్లు, టూత్‌పేస్టులు వంటి వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులతో పాటు బిస్కెట్లు, చిరుతిళ్లు, నూడుల్స్, చాక్లెట్లు వంటి ప్యాకేజ్డ్ ఫుడ్ వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉంది.


అలాగే పాలు, టీ, కాఫీ, శీతల పానీయాల ధరలు కూడా పెరగవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య ప్రజలకు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల మరింత భారంగా మారే అవకాశముందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# ఏఐ ఆధారిత కొత్త టూల్‌ను తీసుకొచ్చిన ఫోన్‌పే

డిజిటల్ చెల్లింపుల రంగంలో ప్రముఖ సంస్థ ఫోన్‌పే వ్యాపారాల కోసం చెల్లింపు వ్యవస్థల అనుసంధాన ప్రక్రియను మరింత సులభతరం చేసే కొత్త ఏఐ ఆధారిత టూల్‌ను ప్రారంభించింది. ఈ సరికొత్త వ్యవస్థ ద్వారా గతంలో వారాల తరబడి పట్టే పేమెంట్ గేట్‌వే ఇంటిగ్రేషన్ ప్రక్రియను ఇప్పుడు కేవలం నిమిషాల్లో పూర్తి చేయవచ్చని కంపెనీ వెల్లడించింది.



కొత్త ఏఐ ఆధారిత ఇంటిగ్రేషన్ సిస్టమ్ సహాయంతో వ్యాపార సంస్థలు పెద్దగా సాంకేతిక పరిజ్ఞానం లేకుండానే ఫోన్‌పే పేమెంట్ గేట్‌వేను తమ వ్యవస్థలతో సులభంగా అనుసంధానం చేసుకోవచ్చని తెలిపింది.

ఇప్పటి వరకు ఈ ప్రక్రియలో కోడింగ్, డాక్యుమెంట్ల పరిశీలన, పలు సాంకేతిక మార్పులు అవసరమయ్యేవి. అయితే ఇప్పుడు ఏఐ ఏజెంట్ల సహాయంతో సాధారణ సంభాషణ తరహాలోనే మొత్తం ప్రక్రియ పూర్తవుతుందని కంపెనీ అధికారులు పేర్కొన్నారు.

ఈ ఏఐ కేవలం కోడ్ రాసే సాధనం మాత్రమే కాకుండా, చెల్లింపు వ్యవస్థల పనితీరును అర్థం చేసుకునే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉందని వివరించారు. కంపెనీ రూపొందించిన ప్రత్యేక ఇంటిగ్రేషన్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ కారణంగా మొత్తం ప్రక్రియ మరింత వేగవంతంగా, స్మార్ట్‌గా మారిందని తెలిపారు.

ప్రత్యేకంగా చిన్న, మధ్య తరహా వ్యాపారాలకు ఈ ఫీచర్ ఎంతో ఉపయోగపడనుందని కంపెనీ అభిప్రాయపడింది. సాధారణంగా ఈ తరహా సంస్థల్లో పెద్ద డెవలపర్ బృందాలు లేకపోవడం వల్ల చెల్లింపు వ్యవస్థల అనుసంధానం క్లిష్టంగా మారుతుందని, ఇప్పుడు ఏఐ టూల్‌తో ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు లేకుండా వేగంగా ఆన్‌లైన్ చెల్లింపులు ప్రారంభించవచ్చని పేర్కొంది.

ఫోన్‌పే తెలిపిన వివరాల ప్రకారం, ఈ సిస్టమ్ అవసరమైన ఏపీఐలు, చెల్లింపు సెటప్‌లను స్వయంచాలకంగా గుర్తించి అమలు చేస్తుంది. అలాగే లోపాలను సరిచేసి అవసరమైన సాంకేతిక మెరుగుదలలను కూడా చేస్తుంది. దీంతో డెవలపర్‌ల సమయం గణనీయంగా ఆదా కావడంతో పాటు కంపెనీలు తమ ఉత్పత్తులు, సేవల అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టవచ్చని కంపెనీ వెల్లడించింది. భవిష్యత్తులో కూడా మరిన్ని ఏఐ ఆధారిత సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ఫోన్‌పే యోచిస్తున్నట్లు తెలిపింది.

# సీబీ 1000 హార్నెట్ ఎస్‌పీ బైకులను రీకాల్ చేసిన హోండా

హోండా మోటర్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా తన సీబీ 1000 హార్నెట్ ఎస్‌పీ మోటర్‌సైకిళ్లను రీకాల్ చేస్తున్నట్లు ప్రకటించింది. చమురు పైపుకు సంబంధించిన సాంకేతిక లోపాలు గుర్తించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది.



సెప్టెంబర్ 30, 2024 నుంచి ఆగస్టు 22, 2025 మధ్య తయారైన బైకుల్లో రెండు రకాల సాంకేతిక సమస్యలు ఉన్నట్లు గుర్తించినట్లు హోండా తెలిపింది. ముఖ్యంగా ఇంధన సరఫరా గొట్టం అమరికలో లోపాలు ఉండే అవకాశముందని పేర్కొంది.

కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఆ పైపు సరిగా బిగించబడకుండా ఉండే అవకాశం ఉందని, దీని వల్ల భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే రీకాల్ ప్రక్రియ ప్రారంభించినట్లు కంపెనీ వెల్లడించింది. సంబంధిత బైకులను అధికారిక సర్వీస్ కేంద్రాలకు తీసుకువచ్చి తనిఖీ చేయించుకోవాలని వినియోగదారులకు సూచించింది. అవసరమైతే లోపభూయిష్ట భాగాలను ఉచితంగా మార్చి ఇస్తామని హోండా స్పష్టం చేసింది.

వినియోగదారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ పేర్కొంది.

# భారీ రాయితీలతో కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్న టాటా మోటర్స్




దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ కొనుగోలుదారులను ఆకట్టుకునేందుకు భారీ రాయితీలను ప్రకటించింది. ఇప్పటికే పలు వాహన సంస్థలు ప్రత్యేక ఆఫర్లతో మార్కెట్లో పోటీ పడుతుండగా, ఇప్పుడు టాటా మోటర్స్ కూడా అదే దిశగా అడుగులు వేస్తోంది.

కంపెనీకి చెందిన పలు మోడళ్లపై గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనాలు అందిస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో ఎక్స్ఛేంజ్ బోనస్, నగదు రాయితీలు, కార్పొరేట్ డిస్కౌంట్‌లు, ఇతర ప్రత్యేక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. పెరుగుతున్న పోటీ నేపథ్యంలో అమ్మకాలను పెంచుకోవడమే ఈ ఆఫర్ల లక్ష్యమని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

ఇదిలా ఉండగా టాటా మోటర్స్ తన ప్రజాదరణ పొందిన నెక్సాన్ శ్రేణిలో కొత్త 'నెక్సాన్ ప్యూర్ ప్లస్ పీఎస్' మోడల్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది.

పానోరమిక్ సన్‌రూఫ్‌తో రూపొందించిన ఈ కొత్త వేరియంట్ ప్రారంభ ధరను రూ.9.59 లక్షలుగా నిర్ణయించింది.

పెట్రోల్ మోడల్ ధరలు రూ.9.59 లక్షల నుంచి రూ.10.14 లక్షల మధ్య ఉండగా, సీఎన్‌జీ వేరియంట్ ధర రూ.10.39 లక్షలుగా నిర్ణయించారు. డీజిల్ మోడల్ ధరలు రూ.10.54 లక్షల నుంచి రూ.11.19 లక్షల వరకు ఉన్నాయి. ఇవన్నీ న్యూఢిల్లీ ఎక్స్‌షోరూం ధరలు.

ఈ కొత్త మోడల్‌లో 1.2 లీటర్ టర్బోచార్జ్డ ఇంజిన్‌ను అమర్చారు. పెట్రోల్, ట్విన్ సిలిండర్ ఐసీఎన్‌జీ, డీజిల్ వేరియంట్లలో ఈ కారు అందుబాటులోకి వచ్చింది.

వాయిస్ కమాండ్ ద్వారా పానోరమిక్ సన్‌రూఫ్‌ను నియంత్రించే సదుపాయం ఈ కారులో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అలాగే 26 సెంటీమీటర్ల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, ఆరు స్పీకర్లు, హెచ్‌డీ రియర్ కెమెరా, ఆటో ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్ వంటి ఆధునిక ఫీచర్లను కూడా ఇందులో అందించారు.

కొత్త మోడళ్లతో పాటు ఆకర్షణీయమైన రాయితీలు ప్రకటించడం ద్వారా మార్కెట్లో తన స్థానాన్ని మరింత బలపర్చుకోవాలని టాటా మోటర్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# 'దృశ్యం 3' ట్రైలర్‌కు భారీ స్పందన

భారతీయ సినీ పరిశ్రమలో సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'దృశ్యం' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న మూడో భాగం 'దృశ్యం 3'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన రెండు భాగాలు ఉత్కంఠభరిత కథనం, అనూహ్య ట్విస్టులతో విశేష ఆదరణ పొందగా, ఇప్పుడు మూడో భాగం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. శనివారం విడుదలైన 'దృశ్యం 3' ట్రైలర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "గతం ఎప్పటికీ నిశ్శబ్దంగా ఉండదు.. అది సరైన సమయం కోసం ఎదురుచూస్తుంది" అనే డైలాగ్‌తో ప్రారంభమైన ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. జార్జ్ కుట్టి పాత్రలో మోహన్ లాల్ మరోసారి తన అద్భుత నటనతో మెప్పించారు. ఈసారి కథ మరింత డార్క్, ఇంటెన్స్‌గా ఉండబోతున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. గత భాగాల్లో పోలీసుల దర్యాప్తు ప్రధానంగా సాగగా, ఈసారి మీడియా ఇన్వెస్టిగేషన్ కీలక పాత్ర పోషించనుంది. వరుణ్ ప్రభాకర్ కేసు వెనుక నిజాలను బయట పెట్టేందుకు ఇద్దరు యువ జర్నలిస్టులు రంగంలోకి దిగడం కథలో కొత్త మలుపును తీసుకొచ్చింది. జార్జ్ కుట్టి కుటుంబంపై మళ్లీ అనుమానాలు కమ్ముకుంటుండగా, మీడియా విచారణతో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారినట్లు ట్రైలర్‌లో చూపించారు. కుటుంబాన్ని రక్షించేందుకు జార్జ్ కుట్టి మరోసారి సాహసోపేత నిర్ణయాలు తీసుకునేలా కథ సాగనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో మీనా, ఎస్తర్ అనీల్, అన్సిబ హసన్, ఆశా శరత్, సిద్ధార్థ్ తదితరులు తమ పాత పాత్రల్లోనే కనిపించనున్నారు. వీణా నందకుమార్ కీలక పాత్రలో నటిస్తుండగా, మురళీ గోపి, గణేష్ కుమార్, శాంతి మాయాదేవి కూడా కథలో ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సాంకేతికంగా కూడా సినిమా మరింత బలంగా కనిపిస్తోంది. సతీష్ కురుప్ సినిమాటోగ్రఫీ, వినాయక్ వి.ఎస్ ఎడిటింగ్, అనిల్ జాన్సన్ సంగీతం ట్రైలర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచుతోంది. ట్రైలర్‌కు వస్తున్న స్పందన చూస్తుంటే 'దృశ్యం 3' మరోసారి భారతీయ సినీ ప్రేక్షకులను థ్రిల్ చేయడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

---




# 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47'పై భారీ ఆసక్తి

విక్టరీ వెంకటేశ్ హీరోగా దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'ఆదర్శకుటుంబం - హౌస్ నెం.47'పై సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం 'ఏకే 47' అనే వర్కింగ్ టైటిల్‌తో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా గురించి రోజుకో ఆసక్తికర విషయం బయటకు వస్తోంది.

తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో వెంకటేశ్ పాత్ర చాలా ప్రత్యేకంగా ఉండబోతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో ఆయన 'రా ఏజెంట్' పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. అయితే ఇది సాధారణ స్పై థ్రిల్లర్ తరహాలో కాకుండా, పాత్రకు ప్రత్యేకమైన లోపాన్ని జోడిస్తూ దర్శకుడు త్రివిక్రమ్ కథను డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది.

వెంకటేశ్ పాత్రకు దృష్టి లోపం ఉంటుందని, అలాంటి పరిస్థితుల్లో కూడా రా ఏజెంట్‌గా ఆయన మిషన్లను ఎలా పూర్తి చేశాడు, ప్రమాదకర ఛేజ్‌లను ఎలా ఎదుర్కొన్నాడు అనే అంశాలను ఉత్కంఠభరితంగా చూపించనున్నట్లు తెలుస్తోంది.

యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్, వినోదాన్ని మేళవిస్తూ త్రివిక్రమ్ తనదైన శైలిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఫ్యామిలీ డ్రామాతో పాటు స్టైలిష్ స్పై యాక్షన్ అంశాలు కూడా ఉండటంతో సినిమా స్థాయి మరింత పెరిగినట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి.

ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ కీలక పాత్రలో కనిపించనున్నాడు. 'మీర్జాపూర్' వెబ్ సిరీస్ ద్వారా గుర్తింపు పొందిన ఆయన ఈ సినిమాలో తీవ్రవాదిగా నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కథలో కీలక మలుపులకు ఆయన పాత్ర కారణమవుతుందని సమాచారం.

హీరోయిన్‌గా శ్రీనిధి శెట్టి నటిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ హారికా అండ్ హాసిని క్రియేషన్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. నిర్మాణ విలువల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా భారీ స్థాయిలో సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది.



# లక్ష రూపాయల నుంచి వేల కోట్ల సామ్రాజ్యానికి ఆసిన్ ప్రయాణం

సినీ పరిశ్రమలో హీరోయిన్ల పారితోషికం ఎప్పుడూ చర్చనీయాంశంగానే ఉంటుంది. ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాల హవా పెరగడంతో స్టార్ హీరోయిన్లు కూడా భారీ స్థాయిలో రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తున్నారు. కొంతమంది హీరోలకు సమానంగా, మరికొందరు వారికంటే ఎక్కువగానే పారితోషికం అందుకుంటున్నారు. ఇలాంటి సమయంలో ఒకప్పుడు తొలి సినిమాకు కేవలం లక్ష రూపాయల పారితోషికం తీసుకున్న హీరోయిన్.. ఇప్పుడు వేల కోట్ల ఆస్తులకు అధిపతిగా మారడం ఆసక్తికరంగా మారింది. ఆ నటి మరెవరో కాదు.. దక్షిణాది, బాలీవుడ్ చిత్రాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆసిన్. తెలుగులో దర్శకుడు పూరి జగన్నాథ్ తెరకెక్కించిన 'అమ్మానాన్న ఓ తమిళ్ అమ్మాయి' సినిమాతో ఆసిన్ హీరోయిన్‌గా పరిచయమైంది. ఈ చిత్రం విజయవంతం కావడంతో ఆమెకు టాలీవుడ్‌లో వరుస అవకాశాలు వచ్చాయి. అయితే తొలి సినిమాకు ఆమెకు కేవలం లక్ష రూపాయల పారితోషికం మాత్రమే అందిందని సినీ వర్గాల్లో ప్రచారం ఉంది. ఆ తర్వాత ఆసిన్ తెలుగులో 'శివమణి', 'లక్ష్మీ నరసింహ', 'ఘర్షణ', 'చక్రం', 'అన్నవరం' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. నాగార్జున, బాలకృష్ణ, ప్రభాస్, పవన్ కళ్యాణ్ వంటి స్టార్ హీరోల సరసన నటించి స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తెలుగుతో పాటు తమిళ చిత్రపరిశ్రమలోనూ ఆసిన్ అగ్ర హీరోలతో కలిసి అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించింది. అనంతరం బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి అక్కడ కూడా తన నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. హిందీ చిత్రసీమలో 100 కోట్ల వసూళ్లు సాధించిన తొలి హీరోయిన్‌లలో ఒకరిగా నిలిచింది. తర్వాత మైక్రోమ్యాక్స్ సంస్థ సహ వ్యవస్థాపకుడు రాహుల్ శర్మను ప్రేమించి 2016లో వివాహం చేసుకుంది. పెళ్లి అనంతరం ఆసిన్ పూర్తిగా సినీ రంగానికి దూరమై కుటుంబ జీవితానికే ప్రాధాన్యం ఇచ్చింది. రాహుల్ శర్మ ప్రముఖ వ్యాపారవేత్త కావడంతో వేల కోట్ల ఆస్తులకు అధిపతిగా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆ కుటుంబ ఆస్తుల విలువ పదివేల కోట్లకు పైగానే ఉంటుందని ప్రచారం జరుగుతోంది. దీంతో ఒకప్పుడు లక్ష రూపాయల పారితోషికంతో సినీ ప్రయాణం ప్రారంభించిన ఆసిన్.. ఇప్పుడు విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్న ప్రముఖ సెలబ్రిటీల జాబితాలో చేరింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in